

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల ‘‘చైతన్య రాహిత్యంలో స్త్రీ’’

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**కార్లు రెండూ లాడ్జి** ముందు ఆగాయి. సిటీలో కెల్లా అతి నాగరీకమూ, అతి ఖరీదు అయిన హోటల్ అది.

మూడవ అంతస్తులో లిఫ్ట్ నుంచి దిగారు అంతా. రూం నెంబరు...

రూంలో అహల్య కాదు కమల జబర్దస్తీగా బెడ్ మీద పడుకుని వుంది, ఆమె కావాలనే ఆలా పడుకుంది వచ్చీ రాగానే.

“ఎన్నాళ్ళకి, ఎన్నేళ్ళకి కలుసుకున్నాం మనం కమలా!” దగ్గరగా ఆత్రంగా రాబోతూ అన్నాడు సుధీర్.

“ఆగు సుధీర్! ఇప్పుడు ఆనాటి ప్రేమ కబుర్లు చెప్పటానికి రాలేదు నేను. నేనిలా పడుకుంటాను. నువ్వలా సోఫాలో కూర్చో. ముందస్తుగా చెప్పు. నువ్వసలు నిజంగా నన్ను ప్రేమించావా లేదా ఆ నాడు.” కోపంగా అడిగింది.

ఎంచేతో ఆమెకు ఇక్కడికి వచ్చేటప్పుడున్న ఎమోషన్  ఈ క్షణంలో లేదు. “తప్పా?” అనే ఏదో ప్రశ్న లోలోపల.

తను కోరగానే తన రూంకు వచ్చిన కమల ఎక్కడికి వెళుతుంది? తన కోర్కె తీర్చి వెళ్తుంది. కానైతే కాస్త బెట్టు చూపిస్తోందంతే!

సరే. ఆమె ప్రశ్నకి జవాబు చెప్పి ప్రసన్నురాలిని చేసుకోవటమే హాయి.

ఈ పూట శాంతి లలిత, రాజుల వెంట పిక్చర్ కి వెళతానంది.

కమల ప్రాతివత్యం కబుర్లు చెబుతుందా? చెప్పనీ, తనూ వింటాడు. నవ్వుతాడు. అంటాడు. 'పరాయి వాణ్ణని దూరంగా వుంచగలిగానని మురిసిపోతూ పాతివ్రత్యపు కబుర్లు చెప్పకు కమలా! నేను కోరీ కోరగానే హోటల్ కు పరుగెత్తుకుని వచ్చిన క్షణంలోనే నీ పాతివ్రత్యం గాలికి ఎగిరిపోయింది తెలుసుకో. హోటల్ గదిలోని మొజాయిక్ ఫ్లోర్ మొదలు గూర్ఖా వరకూ నీ పాతివత్యాన్ని గానం చేస్తారు రేపట్నుంచీ, బెట్టు చెయ్యకు. సినిమాలలో విలన్ లా రేప్ దృశ్యం సృష్టిస్తానేమో నని భయపడకు. అంత సరదా లేదు నాకు. ఓ అవకాశం వచ్చింది మనిద్దరికీ. సరదాగా వినియోగించుకుందాం అంటే సరే. లేదంటావూ, లక్షణంగా నువ్వు వెళ్ళవచ్చు. నాకు అనేకానేక బిజినెసులలో ఇలాటి చిన్న చిన్న సరదాలు వో అంతర్భాగమే గానీ జీవన్మరణ సమస్య కాదు' అని నాలుగు దులిపి పంపేస్తాడు. అలా ఆలోచిస్తున్నాడు సుధీర్.

'ఇప్పుడూ నిన్నే ప్రేమిస్తున్నాను. శాంతిని విధి లేక భరిస్తున్నాను' అని అతగాడి నోట పలికించి తన జాకెట్ లో దాచి ఆన్ చేసి వుండిన పవర్ ఫుల్ టేప్ లో అతగాడి స్వరం రికార్డు చేయాలనీ, అది శాంతికి వినిపించాలనీ కమల ఆరాటం.

"ఏం సుధీర్? మాట్లాడవు?" అంది కమల మళ్ళా." నన్ను ఆనాడు ప్రేమించావా లేదా?"

"చచ్చేలా." సుధీర్ నవ్వాడు.

"మరీనాడు?"

"ఇంకా చచ్చేలా?"

"శాంతిని?"

"శాంతి నా భార్య."

"అంటే?"

“భార్యంటే అర్ధం తెలీని రచయిత్రివా? ఆహ్హాహ్హా ! భరింపబడునది. వదిలించుకో వీలు లేనిది. భరింపక తప్పనిది. ఇలా ఏ అర్ధం తీసుకున్నా అతికి పోతుందే. ఆహ్హాహ్హా” సుధీర్ నవ్వు.

“అయితే నన్ను ప్రేమిస్తూ ఈ నాటికీ శాంతిని భరిస్తున్నావన్నమాట.”

“ఎక్జాట్లీ కరెక్ట్.”

“మరానాడు నన్ను పెళ్లాడలేక పోవటం పిరికి తనమా?”

“కావచ్చు. కాకపోనూ వచ్చు. ఇప్పుడా గతమంతా ఎందుకు కమలా? ఇలాటి అవకాశం ఏదో వస్తుందని నా అంతర్వాణి ఆ రోజు నుంచీ ఈ రోజువరకూ చెబుతూనే వుంది. ఛ్ ఛ్! ఏమిటా మైల్డ్ చప్పుడు?

మై గాడ్! నా మాటలన్నీ టేప్ చేస్తున్నావా? వ్వాటె పిటీ మై డియర్ కమలా! మా డబ్బు గలవారిలో ఇలాటి సరదాలు తప్పు కాదోయ్! మీకూ తప్పు కాదు.

పెద్ద పెద్ద బిజినెసులలో, ఇంకా భయంకరమైన వెన్నో టేప్ రికార్డ్ చేస్తాం మేమూ, మా ప్రత్యర్ధులూ కూడా. ఫోటోలు తీస్తాం. కానీ అలాటివే సర్దుకొంటాం తెలివిగా. ఇదో లెక్కా. కమాన్! ఆ పిచ్చి రికార్డ్ ఆఫ్ చేసి ఇలారా. నువ్వు ఆఫ్టరాల్ పది కథలు రాసి, కాస్తంత పేరు తెచ్చుకుని శాంతి లాటి సాహిత్యపు పిచ్చి గలవాళ్ళు కొందరు ఆరాధిస్తుంటే ఏదో నీ ‘అహం’ తృప్తి పరుచుకోగల స్థాయికి వచ్చేవేమో గానీ, మాకున్న డబ్బులో పదో వంతుకైనా ఎదగలేవీ జన్మకు. నాకిలాటి సరదాలెన్నో వున్నాయని శాంతికి తెలుసు. నువ్వు శాంతి చెవుల్లో ఈ టేప్ పలికించినా నవ్వి వూరుకుంటుంది. అలాటి ఆలోచన వుంటే మానుకో.

రేపు నువ్వింకా ప్రఖ్యాత రచయిత్రివై ఆంధ్రదేశం అంటా నీకు నీరాజనాలిచ్చి, నీ ఇంటర్వ్యూ కోసం ఎగబడి జనం వస్తే... గొప్పగా చెప్పు, “ఫలానా సుధీర్ నాకోసం వెర్రెత్తి పోయాడు. నేను అనుగ్రహించలేదు” అని. అది నీకూ, నాకు కూడా ఓ గ్లామర్ అయి కూర్చుంటుంది. కమాన్... రావోయ్ బెట్టు చెయ్యక.”

కమల నిర్ఘాంత పోయింది.

సుధీర్ ను శాంతిని ఏడిపించే వరకే తన పథకం. ఇలా తిప్పి కొడుతున్నాడేమిటి?

కాలింగ్ బజర్ బజ్ అంటూ...

“ఎవరో వచ్చారు బిజినెసుకు సంబంధించి. ప్చ్... అనవసరంగా కాలయాపన చేసావు కమలా! మరో అవకాశం వస్తుందో రాదో ఇలా. నువ్వా పక్క రూంలో కూర్చో. కాస్సేపు మాట్లాడి వాళ్ళని పంపెస్తాను” అన్నాడు సుధీర్ నవ్వుతూ,

కమల అటాచ్డ్ రూంలోకి వెళ్ళింది.

తలుపు తీసి శాంతిని చూస్తూ కొంచెం కంగు తిన్నాడు సుధీర్.

శాంతి ఆ విశాలమయిన ఏర్ కండిషన్డ్ రూంలోకి ఎరమీద దూకే పులిలా అడుగెట్టింది. ఆమె వెనకాలే డాక్టర్ లలిత, లాయరు రాజు, డాక్టర్ రామచంద్రం, సుమతి, గోపాలరావులు వచ్చారు.

"శాంతీ!" అన్నాడు సుధీర్. గుడ్లు పెకి వచ్చి చనిపోయే వ్యక్తిలా నిర్ఘాంతపోతూ చూస్తూ,

చాలామార్లు ఇలాటి సరదాలలో శాంతి యిలా రంగప్రవేశం చేసి కొంత రసాభాస చేయటమూ, తనేదో సర్ది చెప్పి పారిజాతాపహరణం లాటి సీను ఒకటి చేసి ఆ గండం గట్టెక్కించుకోవటమూ లోగడ ఐదారు మార్లు జరిగాయి. కానీ శాంతి ఇలా ఇంత పకడ్బందీగా  పరివారంతో వచ్చేసి అల్లరి పెట్టిన సందర్భాలు లేవు. అంచేతే శాంతికి తెలిసినా ఫర్వాలేదన్న ధీమాతో వున్నాడీ విషయంలో.

"కమలా! రా." శాంతి జబర్దస్తీగా పిలిచింది.

కమల నిర్ఘాంతపోయింది.

మరుక్షణంలో శాంతి కమల చేయి పట్టుకుని గబగబా నడిపించుకుని వచ్చింది, లాక్కు వచ్చినట్లు హాలులాటి ఆ గదిలోకి.

కమలకా రూమంతా గిర్రున తిరుగుతున్నట్లయింది. మనుషులెవరెవరో గుర్తు తెలియటం లేదు. అంతా కొత్తవాళ్ళు. శాంతి, సుధీర్ లు తప్ప. కానీ కానీ పాలిపోయి వున్న గోపాలరావు, తన భర్త... తనకేసి పిశాచాన్ని చూచినట్లు చూస్తున్న చూపు.

"కమలా! నను చంపి వేసి ఇలా ప్రవర్తించినా నాకు బాధ కలిగేది కాదు కదా" అనే చూపు ఒక్కటే అర్ధమయింది.

మరుక్షణం ఆమె వెర్రి కేక పెట్టి మొజాయిక్ ఫ్లోర్ మీద అచేతనంగా పడిపోయింది. ఆమె నోటి వెంట నురగలాటి ద్రవం, పమిట క్రింద నుంచి చిన్న టేప్ రికార్డరు అగ్గిపెట్టంత వున్న మైక్ (చాలా మోజుపడి వారం క్రితం వో లక్షాధికారి స్నేహితురాలి దగ్గర రెండువేలు అప్పు పెట్టి మరీ కొన్నది. ఆ కారణంగా గోపాలరావుతో ఆ రోజు పోట్లాట జరిగింది) నేల మీద పడింది. ఆమె స్పృహ కోల్పోతూ అరిచిన అరుపు ఒక్కటే నిజం. "నేను తప్పు చేయలేదు."

డాక్టర్ రామచంద్రం, డాక్టరు లలిత అహల్యను స్పృహలోకి తేవాలని శత విధాల ప్రయత్నించారు.

ఆమె తిన్న షాకులో ఆమె స్పృహ కోల్పోయింది! ఒక రోజు కాదు. రెండు రోజులు కాదు. మూడు నెలలు ఆమె ఆ కోమాలో వుండి పోయింది లలితా నర్సింగ్ హోంలో.

శాంతి, సుధీర్ లు బొంబాయి వెళ్ళిపోయారు.

రామచంద్రం, సుమతిలు విజయవాడ వచ్చేసారు. అయితే ప్రతి ఆదివారం రామచంద్రం వచ్చేవాడు, 'అహల్య' కు స్పృహ వచ్చిందీ లేనిదీ తెలుసుకోవటానికి.

సుధీర్ శాంతిని నానా తిట్లూ తిట్టాడు. అహల్యకు తిరిగి స్పృహ తెప్పించేవరకు ఎంత ఖర్చుఅవుతుందో అదంతా తామే భరిస్తామని చెప్పివెళ్ళారు ఇద్దరూ. శాంతి చాలా గిల్టీగా ఫీలయ్యింది.

"కమలా! నన్ను క్షమమించవే!" అని ఏడ్చి వెళ్ళింది, స్పృహలేని కమల చేయి పట్టుకుని.

సిటీలోని డాక్టర్లంతా చూచారు. 'Encephailits' (సూక్మజీవుల వలన తలకు వచ్చే వ్యాధి) లేక 'Transmatic Head Injury (దెబ్బ తగులుట వల్ల తలలోని నరములు పని చేయకుండా పోవుట) Belsenill (Sulphate abbot) షాక్ వల్ల కోమాలో రోజుల తరబడి పడి పోవటం అంటూ ఏవేవో పేర్లు చెప్పారు ఆ జబ్బుకి. మందులూ చెప్పారు. ఇది ఇలా అక్కడక్కడా జరుగుతున్నట్లు, జబ్బు కాని జబ్బు అనీ, ఇలా స్పృహ లేని స్థితిలో కొందరు పేషెంట్లు నెలల తరబడి ఉంటారనీ, కొందరు సంవత్సరాల తరబడి ఉంటారనీ, ఎప్పుడు స్పృహ వస్తుందో చెప్పటం కష్టం అనీ నిర్ణయించారు.

ఈ వార్త పేపర్లలో కూడా వచ్చేసింది.

శాంతి ద్వారా తెలిసింది రామచంద్రంకు, అహల్య అసలుపేరు కమల అనీ, కమల శ్రీహరిరావు మాస్టారి కూతురు అనీనూ.

తను మెడిసిన్ చదువుతున్న రోజుల్లో వో మారు తిరుపతిలో శ్రీహరిరావు మాస్టారుగారు కనిపించటం, తన ఆఖరు అమ్మాయి పెళ్లి విషయమై ఆయనగారు ఆందోళన వెలిబుచ్చటం, తను ఆ అమ్మాయిని చూడకుండానే కేవలం శ్రీహరిరావు మాస్టారుగారి మీదుండే గౌరవం కొద్దీ పెళ్లాడతానని చెప్పటమూ, అందుకు శ్రీహరిరావు మాస్టారు అలాటి అదృష్టం తన కూతురుకి లేదనీ, ఆమెలో వో విధమైన పట్టుదలతో ప్రాణాలు తోడుతోందని చెప్పటమూ అన్నీ గుర్తుకు వచ్చాయి.

ఈమె కమల! శ్రీహరిరావు మాష్టారి కూతురు! గోపాలరావు భార్య అయింది.

సుధీర్ ను ప్రేమించి, ప్రేమించబడింది. కాని సుధీర్ లాటి గొప్పవారికి కొందరికి ప్రేమన్నది కాలక్షేపమే గాని, ప్రాణాధికమైనది కాదని తెలుసుకోలేక పోయింది.

కనీసం గోపాలరావుతో తనకు లభ్యమయిన సాంసారిక జీవితంతో తృప్తి పడినా సరిపోయేది. అలా తృప్తి పడలేక అసంతృప్తితో వేగిపోయింది. ఆవేదనలో నుంచి ఏవో కొన్ని ఊహలు, కదల రూపంలో బయటపడి, ఓ రచయిత్రిగా కాస్తంత పేరు సమకూర్చాయి.

ఆ పేరుతో బాటు అత్యాశ, అహం, తనున్న జీవితపు పరిధి తనకు చాలదన్న అసంతృప్తి తిరిగి తలెత్తాయి. కోర్కెలు మరింతగా విజ్రుంభించాయి. విలాసాల పట్ల మోజు పెరిగింది.

సుధీర్, శాంతిలు రంగప్రవేశం చేయటంతో ఆమెలో ప్రతీకార వాంఛలతో బాటు, అంతర్గతంగా సుధీర్ తో కొద్ది కాలమే అయినా సన్నిహితంగానూ, ఆత్మీయంగానూ మెలగాలనే కోర్కె ఆపుకోలేనంతగా పెరిగి పోయింది.

సుధీర్ భోగప్రదమైన జీవితంలో తానూ వాటా పొంది తాత్కాలికంగానే అయినా కొంత శాంతి పొందుదామనుకుంది. అందుకే సుధీర్ రమ్మని కోరగానే (కోరుతాడనీ తెలుసు. కోరేందుకు తగిన ప్రోత్సాహం యిచ్చింది కూడా) హోటల్ కు వెళ్ళింది.

అక్కడే ఆమెలో మానసిక సంఘర్షణ బయల్దేరింది. హోటల్ కు వచ్చే వరకు ఒకానొక ఎమోషన్ లో వున్నది. తీరా హోటల్ గదిలో అడుగెట్టాక అక్కడ తాను, సుధీర్ మాత్రమే మిగిలిపోయాక, ఆమెలో తరతరాల భారత స్త్రీ సంస్కారము బయటపడింది. సుధీరుతో అక్రమ సంబంధానికి ఆమె ఇష్టపడలేదు. కేవలం సుధీర్ ను కబుర్లలో పెట్టి, కాలక్షేపం చేసి, శాంతి ఏడిపిద్దామని మాత్రమే నిర్ణయించుకుంది.

శాంతి తన పరివారంతో వచ్చేసింది.

ఎవరొచ్చినా కమల తడబడలేదు. కానీ భర్త గోపాలరావును చూచిన మరుక్షణం ఆమె గుండె పగిలినట్లయింది.

తాను చేసింది వో రకంగా తప్పే! పరపురుషుని కోసం హోటలుకు పరుగెత్తుకు రావటం, ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

కానీ ఇంతమందిలో గోపాలరావు తల నేలకు వంగి పోయింది. అతగాడు సర్వం కోల్పోయిన వాడిలా దిగ్భ్రమ పొందాడు. సిగ్గుతో, అవమానంతో చితికి పోయాడు.

అతగాడు చూచిన ఒక్క చూపులో శతకోటి భావాలు బల్లేలలా, విచ్చుకత్తులలా ఆమె హృదయాన్ని తాకాయి.

విపరీతంగా కలిగిన భావోద్వేగం, అవమానం, అందరి ఛీత్కారపు చూపులలోని అగ్ని... ఆమె షాక్ తిన్నది.

చైతన్య రాహిత్య స్థితిలో రాయిలా బిగుసుకు పోయింది. ఆమె జీవించి వున్నందుకు గుర్తుగా శ్వాసకోశాలు పని చేస్తున్నాయే తప్ప మెదడు మొద్దుబారి పోయింది. ఇంద్రియాలకు ఆజ్ఞలు జారీ చేసే నాడీ కేంద్రం రాయిలా వుండి పోయింది.

అలా ఎనలైజ్ చేసాడు డాక్టర్ రామచంద్రం, సైకాలజీని, జబ్బునీ క్షుణ్ణంగా పరిశీలిస్తూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments